ప్రజాశక్తి
బుధవారం 9 జులై 2025



'అనంత'లో విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు యువకులు మృతి
అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య

అనంతపురం జిల్లాలో మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదుగురు యువకులు మృతిచెందారు. ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడి మహారాష్ట్ర రాష్ట్రానికిచెందిన ముగ్గురు యువకులు మృతిచెందారు. తిరుమలకు వెళ్లి వస్తున్న సమయంలో కారు అదుపు తప్పి బోల్తాపడిన ఈ ప్రమాదంలో వీరు మృతిచెందారు. కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలోని ఓ వ్యవసాయ పొలంలో నీటి సంపులో పడి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు. జీవనోపాధి నిమిత్తం కళ్యాణదుర్గం వచ్చిన వీరు మంగళవారం పనులు లేకపోవటంతో సమీప గ్రామంలోని వ్యవసాయ తోటలోకి వెళ్లి అక్కడున్న మామిడి తోటలోని కాయలు తిని చేతులు కడుక్కోవటానికి నీటి సంపులో దిగి ఈతరాక అందులో మునిగి మృతిచెందారు. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు సంవత్సరాలుగా మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేస్తే దిగుబడి రాక, వచ్చిన అరకొర పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలయ్యాడు. పంటసాగుకు చేసిన దాదాపు రూ. 8 లక్షల అప్పును ఎలా తీర్చాలో దిక్కుతెలియక మానసిక వేదనకు గురై మంగళవారం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు మెయిన్‌పేజీలో...

నేడు సార్వత్రిక సమ్మె



సమ్మెను జయప్రదం చేయాలని అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు
వామపక్ష పార్టీల మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశ వ్యాప్తంగా నేడు సార్వత్రిక సమ్మెకు ఐక్య కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ సమ్మెను జయప్రదం చేయడానికి అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమయ్యాయి. దీనికి వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా సమ్మెలో పాల్గొనేందుకు సంఘటిత, అసంఘటిత కార్మికులు, స్కీమ్ వర్కర్లు, రైతులు, వ్యవసాయ కార్మికులు సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం నాడు జరిగే సమ్మెను జయప్రదం చేయడంపై ఐక్య కార్మిక సంఘాల నాయకులు కలసి కార్యచరణను రూపొందించారు. జిల్లాలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్‌లు నేడు జరిగే సమ్మెలో పాల్గొననున్నాయి. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఈ సందర్భంగా ఎండగట్టనున్నారు. కార్మిక చట్టాల స్థానంలో లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి వారి హక్కులను కాలరాయడాన్ని కార్మిక సంఘాలు తప్పుబడుతున్నాయి. కార్మిక హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సందర్భంగా కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పనిగంటల పెంపు నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటి వరకున్న ఎనిమిది గంటలను పది గంటలకు పెంచుతూ ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సమ్మె సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పై డిమాండ్లన్నింటితోనూపాటు రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను సమ్మెలో పెట్టడం జరిగింది. దీంతో బుధవారం నాడు జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతోపాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన బ్యాంకింగ్,, పోస్టల్, టెలికం ఉద్యోగ సంఘాలు పాల్గొంటున్నాయి. పెద్దఎత్తున సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని కార్మిక సంఘాల సమయత్తమయ్యాయి.

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా బుధవారం (9వ తేదీన) నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను అనంతపురం జిల్లాలోని ప్రజలు బలపరచాలని, కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు మన్నిల రామాంజినేయులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. ఎన్నో త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు అయ్యాయని, వాటి స్థానంలో కార్మిక వర్గానికి కీడు చేసే లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టబడ్డాయని అన్నారు. కార్మిక వర్గం సంఘం పెట్టుకునే హక్కును, యజమానులతో బేరమాడే హక్కును కోల్పోతున్నారన్నారు. ఇది దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. దేశంలోని కోట్లాదిమంది కార్మికులు వారికి మద్దతుగా రైతాంగం సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో సహా దేశంలోని అన్ని ప్రాంతాలలో సమ్మె ప్రభావం కనబడుతుందని ఈ సమ్మెకు మద్దతుగా వామపక్ష పార్టీలు, వివిధ రాజకీయ పక్షాలు కార్యక్రమాలకు పిలుపునిచ్చాయని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ విధానాలను సమర్థిస్తూ ఎనిమిది గంటల పనిని రద్దు చేసి దాని స్థానంలో 10 గంటల పనిని ప్రవేశపెట్టిందని విమర్శించారు. వేతనాలు పెంచకపోగా పోటీపడి పని భారాన్ని పెంచడంలో అటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అత్యుత్సాహాన్ని చూపుతున్నాయని విమర్శించారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు సమ్మెకు మద్దతుగా బుధవారం ప్రదర్శనలు నిర్వహించాలని నిరసన తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక కార్మికులతో పాటు, స్కీమ్ వర్కర్‌లు అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం తదితరులతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోస్టల్, ఎల్‌ఐసి, బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్లలో పని చేస్తున్న ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని, ఎలక్ట్రిసిటీ పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు నిరసనలు తెలియజేస్తారని, తోపుడుబండ్ల వ్యాపారులు, ఆటోలు బిల్డింగ్ కార్మికులు, ఆసుపత్రులలో పని చేసే కార్మికులు, యూనివర్సిటీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, వీఎవోలు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

న్యూఢిల్లీకి వెళ్లిన కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. జూలై 9వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు అనంతపురం జిల్లా కలెక్టర్ హాజరు కానున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం (గనులు) శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వైయస్సార్ కడపకలెక్టర్ డాక్టర్.శ్రీధర్ చెరుకూరి, కర్నూలుకలెక్టర్ పి.రంజిత్ బాషా, ప్రకాశంకలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కష్ణా కలెక్టర్ బాలాజీ డి.కె., అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాపులో పాల్గొనడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.ఈ మేరకు జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

ఏడాదిలో రూ.118కోట్లతో 'అనంత' అభివృద్ధి

టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏడాదిలో కాలంలోనే ఒక్క అనంతపురం నియోజకవర్గంలోనే రూ.118 కోట్లతో అభివృద్ధి చేశామని టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి మంగళవారం నగరంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలో పరిపాలన ఎలా ఉందని ప్రత్యేకంగా ప్రజా స్పందన ఏర్పాటు చేసిన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోందన్నారు. ఎమ్మెల్యే ప్రతినిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తున్నారని అభినందించారు. నా నియోజకవర్గ బాగుండాలి. నా ప్రజలు బాగుండాలనే తపన ఆయనలో కనిపిస్తోందన్నారు. గత ఎన్నికల్లో 23 వేల మెజారిటీతో గెలిచిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా 40 వేల మెజార్టీతో గెలుస్తారని జోష్యం చెప్పారు.

సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో అనస్తీషియా పీజీల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 4, 5, 6వతేదీల్లో విశాఖపట్నంలో జరిగిన దక్షిణ భారత రాష్ట్రాల అనస్తీషియా సదస్సులో అనంత వైద్యకళాశాల అనస్థీషియా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు నాలుగు పథకాలను సాధించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా అభినందించారు. ఈమేరకు వైద్య విద్యార్థులను మంగళవారం స్థానిక వైద్య కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా షారోన్ సోనియా మాట్లాడుతూ డాక్టర్ గౌతమికి ఫ్రీ పేపర్ విభాగంలో, డాక్టర్ పూజ, డాక్టర్ సుదీర్‌కు క్విజ్ పోటీల్లో, డాక్టర్ శ్రీధర్‌కు రీల్స్ విభాగంలో సౌత్‌జోన్ అవార్డులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం ప్రధాన విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, ప్రొఫెసర్ కెఎల్ సుబ్రమణ్యం, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ జగదీశాచార్యులు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ షెలియా డైనీ, తదితరులు పాల్గొన్నారు.



అనస్తీషియా పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులను అభినందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా

రైళ్ల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం-సోమలాపురం రైల్వేస్టేషన్ల నడుమరైలు మార్గంలో బాదనహాల్ క్రాసింగ్ స్టేషన్ వద్ద రైలు మార్గ ఇంజనీరింగ్ పనుల నిర్మాణం నిమిత్తం ఈనెల 11వ తేదీన రైళ్ల రద్దు, పాక్షిక రద్దు, ప్రయాణంలో జాప్యం కలగనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-చిక్కజాజురు నడుమ ప్రయాణించే డైలీ ప్యాసింజర్ రైలు సర్వీసును ఈనెల 11న పూర్తిగా రద్దు చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి నడుమ ప్రయాణించే ప్యాసింజర్ రైలు 10న తిరుపతి-గుంతకల్లు నడుమ మాత్రమే ప్రయాణిస్తుందన్నారు. అదేవిధంగా రైలు 11న కదిరిదేవరపల్లి నుంచి కాక గుంతకల్లు-తిరుపతి మధ్య ప్రయాణిస్తుంది. కెఎస్ఆర్ బెంగళూరు హోస్పేట్ నడుమ ప్రయాణించే రైలు 11న అరగంట ఆలస్యంగా ప్రయాణిస్తుందన్నారు.

రేషన్‌షాపుల్లో కందిపప్పు కట్!

ఈఏడాది మార్చిలో ఆగిన వైనం
జులైలోనూ లేని సరఫరా
పేదల్లో అసంతృప్తి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రేషన్ షాపుల్లో కందిపప్పు నిలిచిపోయింది. ఏడాది మార్చి నెల నుంచి సరఫరా కావడం లేదు. తాడిపత్రి మండలంలో అర్బన్ లో 55, రూరల్ లో 39 రేషన్ షాపులు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో కందిపప్పుకు సంబంధించిన టెండర్లు ఖరారు కాకపోవడమే ఇందుకు కారణం అని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. అయితే కందిపప్పుకు బదులు రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న జొన్నలను పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో కార్డుదారులు నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.120 నుండి రూ.160 వరకు ఉంది. అయితే రేషన్ షాపుల్లో కిలో కందిపప్పును రూ.67 కు విక్రయిస్తోంది ప్రభుత్వం. దీంతో ఈ కందిపప్పునకు సామాన్యుల నుండి భారీగా డిమాండ్ ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు చక్కెర, గోధుమ పిండిని సబ్సిడీ ధరకు అందిస్తున్న ప్రభుత్వం కందిపప్పును కూడా సబ్సిడీ ధరకు విక్రయిస్తోంది. రేషన్ దుకాణాల్లో కిలో గోధుమపిండి రూ.16, కిలో చక్కెర రూ.32, కిలో కందిపప్పు రూ.67 కు లభిస్తోంది. ఇటీవల కాలంలో కేవలం బియ్యం, చక్కెర సరఫరాకు పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయడానికి టెండర్లను పిలిచింది. అయితే ఇప్పటివరకు ఈ టెండర్ల కార్యక్రమం ఖరారు కాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మార్చి నెల నుంచి కందిపప్పు సరఫరా ఆగిపోయింది. కందిపప్పు సరఫరాకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించకపోవడంతో భవిష్యత్తులో రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా ఉంటుందా లేదా అన్నది సందేహంగానే మారింది. కందిపప్పునకు బదులు రేషన్ షాపుల్లో రాగులు, జొన్నలు ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. అయితే వీటిని కొనుగోలు చేసేవారు కందిపప్పుతో పోల్చుకుంటే చాలా తక్కువ. కందిపప్పు నకు ఉన్న డిమాండు రాగులు, జొన్నలకు లేదు. ప్రజలకు రాగులు, జొన్నలు తినే అలవాటు కూడా తప్పింది. దీంతో రాగులు, జొన్నలు సరఫరా చేసినా సగం వరకు కూడా వినియోగం కావడం లేదు. కందిపప్పు బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం గతంలో రూ.200 పైగా పలికిన సందర్భం కూడా ఉంది. అయితే రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు రూ.67 లకే వస్తున్నందున బహిరంగ మార్కెట్లో రూ.120 పైగా పెట్టి కందిపప్పు కొనుగోలు చేయడానికి వినియోగదారులు విముఖత చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాగైనా రేషన్ షాపుల ద్వారా కందిపప్పును సరఫరా చేయాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన కందిపప్పు సరఫరా హామీ అర్ధాంతరంగా ఆగిపోవడం పట్ల వినియోగదారులు వసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.





నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు. సిఐటియు నాయకులతో చర్చిస్తున్న డిప్యూటీ కమిషనర్ పావని

విధులు బహిష్కరించి
కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నగరంలోని ఆర్ మాస్టర్ పాయింట్లలో కార్మికులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో అనారోగ్యంతో చనిపోయిన 10 మంది కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, 60ఏళ్ల రిటైర్మెంట్ పేరుతో తొలగిస్తున్న వారి కుటుంబంలో కూడా ఒకరికి ఉపాధి కల్పిస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నగర ప్రజలకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలని, అడిషనల్ కార్మికులకు రూ.15వేలతోపాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ కట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నికల్ పేరుతో 28 మందికి వేతనాలు పడటం లేదన్నారు. సకాలంలో కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవ్‌తో పాటు డిఎ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెల్లవారుజామున విధులు బహిష్కరించి ఏ మాస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని రెండవ సర్కిల్ మస్టర్ పాయింట్ దగ్గరకు వచ్చి కార్మికులు, సిఐటియు నాయకులతో చర్చించారు. రెండు, మూడు రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, నాగభూషణం, మున్సిపల్ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.గోపాల్, తిరుమలేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, మహిళా కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, మున్సిపల్ ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో వైఎస్ఆర్

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా లేకపోయినా జనం హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయం వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచి పెట్టారు. తర్వాత వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తర్వాత వైసిపి ఇంటెలెక్చువల్ వింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కట్టుబడి తానీషా, రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు రమేష్, నగర అధ్యక్షుడు జయప్రకాష్‌రెడ్డి, దాసిరెడ్డి ఆధ్వర్యంలో డెయిరీ ఆవిష్కరించారు. కమలానగర్‌లో ఉన్న 'నిరాశ్రయ' వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కాగా నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి వైసీపీ శ్రేణులతో కలిసి నివాళుర్పించారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు.



అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు



జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల పెంపకంలో భాగంగా మంగళవారం గుత్తి మండలం కరిడికొండ గ్రామంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్‌తో కలిసి మొక్క నాటుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా రాజశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా రాజశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ జీవో విడుదల చేశారు. దీంతో మంగళవారం స్థానిక కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కమిషనర్ బాలస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. రాజశేఖర్ గతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పని చేస్తూ సెలవుపై వెళ్లారు. తర్వాత పోస్టింగ్ కోసమే వెయిటింగ్ లిస్టులో ఉన్న జి.రాజశేఖర్‌ను ఖాళీగా ఉన్న అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టులో నియమించారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎస్ఇ రాజశేఖర్

అల్ట్రాటెక్ సున్నపురాయి గనికి ఫైవ్‌స్టార్ రేటింగ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లా పరిధిలోని అల్ట్రాటెక్ సున్నపురాయి గనికి గనుల మంత్రిత్వ శాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నుంచి 5-స్టార్ రేటింగ్ వచ్చింది. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌కు చెందిన 13 సున్నపురాయి గనులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, గనుల మంత్రిత్వ శాఖ ద్వారా గుర్తింపు పొందాయి. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 7న అవార్డు ప్రదానోత్సవంలో ఈ గుర్తింపును ప్రకటించారు. ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ గుర్తింపును గెలుచుకున్న గనుల్లో ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్ భాగమైన తుమ్మలపెంట సున్నపురాయిగని ఒకటి. అలాగే అనంతపురం జిల్లాలో ఉన్న అల్ట్రాటెక్ ఇంటిగ్రే టెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సుస్థిర మైనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ గుర్తింపును గెలుచుకోవడం ఇది వరుసగా మూడవ సంవత్సరం. ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్ తన మైనింగ్ ప్రాంతంలో నీటి సంరక్షణ, గ్రీన్ బెల్ట్ అభివద్ధి, కమ్యూనిటీ నిమగ్నత, సమీపంలోని అనేక గ్రామాలను దత్తత తీసుకోవడం వంటి వాటి ద్వారా ఈ యూనిట్ ఇతర వాటి నుండి ప్రత్యేకంగా నిలిచింది.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో అవార్డు అందుకుంటున్న అల్ట్రాటెక్ అధికారులు

తాగునీటి సౌకర్యం కల్పించాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని నేరెమెట్ల గ్రామంలో సచివాలయం నుంచి మల్లాపురానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రంగారెడ్డి, కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీకి సంబంధించి గతంలో తాగునీటి పైప్‌లైన్ వేశారని, సరఫరా నిలిపివేశారన్నారు. పైపులైనుకు సంబంధించి చెరువు దగ్గర సచివాలయం దగ్గర మోటార్లు ఉన్నప్పటికీ సమస్య పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో కాలనీలో ఉన్న చిన్న పిల్లలు, వృద్ధులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మి, ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, సావిత్రి, చంద, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని డీఎస్పీ రవిబాబు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిక్కవీరప్ప ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే దుష్ప్రభావాలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు బెట్టింగ్ యాప్‌లతోపాటు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు స్నేహభావంతో ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, కళ్యాణదుర్గం పట్టణ సిఐ యువరాజు, పోలీస్ సిబ్బంది స్వాతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటరు దరఖాస్తు సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటర్ జాబితా రూపకల్పన, దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఒ) మంగళవారం పట్టణంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ ఎన్.రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఓటరు జాబితా రూపకల్పన, ప్రజల నుంచి ఫారం 6, 7, 8, 6-ఎ సేకరించడం, భర్తీ చేయడం, దరఖాస్తుదారు నుంచి సంతకం స్వీకరించడం, దరఖాస్తుతో పాటు జతపర్చాల్సిన ధృవీకరణ పత్రాలు మొదలైన వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరం రోజుకు 50 మంది చొప్పున ఈనెల 15వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ రాయదుర్గం ఎంఇఒ వెంకటరమేష్, బొమ్మనహాల్ వీఆర్వో రవికిరణ్, బిఎల్‌ఒలకు ప్రయోగాత్మకంగా దరఖాస్తు ఫారాలు పూర్తి చేయడం, సంతకాలు సేకరించడం వంటివాటిని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రాయదుర్గం, డి.హీరేహాల్ తహశీల్దార్లు నాగరాజు, శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, బిఎల్ఒలు పాల్గొన్నారు.

పశువుల దాణాతో అధిక లాభాలు



రైతన్నలకు దాణ పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

కుందుర్పి : పాలిచ్చే ఆవులకు దాణా వేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని సర్పంచు మారుతీశ్వరి రామమూర్తి, పశువైద్యాధికారి ప్రసాద్ సూచించారు. మంగళవారం పలువురు రైతులకు సబ్సిడీపై పశువుల దాణా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన మోతాదులో పశువులకు దాణా ఇస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కావున సబ్సిడీ దాణాని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ మల్లికార్జున, మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప, మాజీ కో ఆప్షన్ సభ్యులు తాహిర్, మాజీ సర్పంచులు రాఘవేంద్రబాబు, శివలింగప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఓబయ్య, వార్డు మెంబర్ బంగారు నారాయణప్ప, పశువైద్య సహాయకులు హులిరాజు, ఎహెచ్‌ఎలు గురుస్వామి, విజయ్, ప్రదీప్, హీరా, రైతులు గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని ఆశా కార్యకర్తలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1 నుంచి 30వతేదీ వరకూ జాతీయ డెంగు నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రతిఇంటినీ సందర్శించి ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. అలాగే పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ సిహెచ్ జుబేదా, ఫిమేల్ సూపర్‌వైజర్ శోభారాణి, మేల్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జలదికి తరలుతున్న పీర్లు

ముగిసిన మొహర్రం వేడుకలు

శింగనమల : మండల పరిధిలోని పెరవలి, సోదనపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా సాయంత్రం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేయించి మేళతాళాల మధ్య జలదికి తరలించారు. పలువురు భక్తులు తమ కోర్కెలు తీర్చాలని చన్నీటి స్నానాలు ఆచరించి స్వాములకు వార్పు పడ్డారు. అనంతరం స్వాములకు చక్కెల చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం పీర్లను జలదికి తరలించడంతో ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిరోజులపాటు ప్రత్యేక ప్రార్థనలు అందుకున్న పీర్లస్వాములు మేళతాళాలు, తప్పెట్ల మధ్య భక్తులు పీర్లను జలదికి తరలించారు.

బెలుగుప్ప : మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించిన మొహర్రం వేడుకలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా పీర్ల చావడిలో కొలువుదీరిన వన్నూరుస్వామి పీర్లకు భక్తులు బెల్ల చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ శివ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు గురుపౌర్ణమి

యల్లనూరు : ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పూజల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటో కార్మికులు చేపట్టిన ఆటోబంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తదితర కార్మిక అనుబంధ ఆటోసంఘాల ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, జూనియర్ కాలేజ్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వై.వెంకటే నారాయణ, ముత్తుజా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలన్నారు. జీవో 21ను రద్దు చేస్తూ ఆటో కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వాహన మిత్ర అమలు చేయాలన్నారు. రాపిడోను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శులు ఎన్టిఆర్ శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆదినారాయణ నాయక్, రాజు, ఆదినారాయణ, నాగరాజు, రామాంజనేయులు, స్వాతి, కవిత, బాషా పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను ఆవాజ్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలీ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు ఆవాజ్ సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆవాజ్ శ్రేణులు సమ్మెలో భాగస్వాములు కావాలని సూచించారు.

పోస్టర్లు విడుదల

అనంతపురం : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వతేదీ దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు వై.వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఉమా గోడౌన్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా హమాలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమా గోడౌన్ హమాలీ యూనియన్ నాయకులు రామదాసు, శ్రీనివాసులు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు, హమాలీ యూనియన్ నాయకులు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని అంగన్వాడీలు, కార్మికులు, హమాలీలు అందరూ ఈనెల 9వతేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆయా చట్టాలు అమలైతే కార్మికులు యజమాన్యాలకు బానిసలుగా మారుతారన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కావున కార్మికులు, అంగన్వాడీలు, ఆశావర్కర్లు, విఆర్ఎలు, ఐకెపి విఒఎలు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కేశవ్..చేసిన పనులనే చెప్పుకో...

తాగునీటి ప్రాజెక్టులకు గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు-ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

'ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. మీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులనే చెప్పుకో..' అంటూ ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తీర్చడానికి గత వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ దాదాపు రూ.65.94 కోట్ల నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. అయితే సోమవారం ఉరవకొండలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తూ గత ప్రభుత్వం తాగునీటి సమస్యలను నిర్లక్ష్యం చేసిందంటూ మంత్రి కేశవ్ మాట్లాడటం తగదన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఆరునెలల్లో కూటమి ప్రభుత్వం రూ.16కోట్లు వెచ్చించి సమస్యను పరిష్కరించామంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడానికి 2022లోనే అప్పటి జగన్ ప్రభుత్వం రూ.65 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు, విడపనకల్, బెలుగుప్ప మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్పటి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు, లోఓల్టేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి 9 నూతన సబ్‌స్టేషన్లను గత ప్రభుత్వ హయాంలోనే మంజూరు చేయించానన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని తామే మంజూరు చేయించి పనులు పూర్తి చేసి ప్రారంభిస్తున్నట్లు ఓ పత్రికలో వచ్చిన ప్రకటన చూసి తాను ఆశ్చర్యానికి లోనయ్యానన్నారు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని,ఒక ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు మరో ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ అన్నారు. కానీ గతంలో చేసిన మేలు కూడా తామే చేశామంటూ చెప్పుకోవడమే మంచి కాదని హితవు పలికారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపుతాం

'తొలి అడుగు'లో ఎమ్మెల్యే దగ్గుపాటి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి ఏడాదిలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.118 కోట్లతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలో అశోక్‌నగర్‌లో 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని ఆయనపై నమ్మకంతోనే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటన తర్వాత రూ.9.50 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని.. 8.5లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. అనంతపురం జిల్లాలో గతంలో కియా పరిశ్రమ రావడం వల్ల.. దాని అనుబంధంగా పెద్ద ఎత్తున ఆటోమొబైల్ పరిశ్రమలు వచ్చాయన్నారు. ఇప్పుడు సోలార్, ఇతర రంగాల్లో కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌ఛార్జి సరిపూటి శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, కార్పొరేటర్ బాలాంజనేయులు, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

'పొలం పిలుస్తోంది'లో అధికారులు



ఉరవకొండ నియోజకవర్గంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వ్యవసాయ సాగులో సేంద్రియ ఎరువులు ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం రైతు శిక్షణ కేంద్రం అధికారి లక్ష్మీనరసింహులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలికి, హంచనహల్, ఉరవకొండ మండల పరిధిలోని రేణుమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో రైతులు సేంద్రియ సాగులో పశువుల ఎరువు వేసినట్లయితే నేలసారవంతమై మొక్కలు ఆరోగ్యవంతంగా ఉండి మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం సాగు, పంటలకు ఆశించే వైరస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ ఉరవకొండ మండలాల వ్యవసాయ అధికారులు పెన్నయ్య, రామకృష్ణ, ఎఇఒ కైలాష్, రైతు సేవాకేంద్రం సిబ్బంది రమేష్‌నాయక్, హేమ, రక్షిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : వేరుశనగ పంట సాగు చేసిన రైతులు ఈనెల 31వతేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సోదనపల్లి రైతు సేవాకేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సాగుపై సలహాలు, సూచనలు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంపై ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అలాగే వేరుశనగ పంట సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ రైతులు వేరుశనగ పొలంలో కందిని కూడా అంతర్ పంటగా సాగు చేయాలని సూచించారు. అలాగే సాగు, పంటలకు వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మూసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని వినతి



ధర్నా చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

అనంతపురం సిటీ : రాష్ట్రవ్యాప్తంగా 117 జీవో ద్వారా మూసివేసిన పాఠశాలలను తెరిపించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.4200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని, 107, 108 జీవోలను రద్దు చేయాలని, తల్లికి వందనం పథకాన్ని షరతులు లేకుండా అమలు చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేసి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిఆర్ఒ మలోలకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు తేజ, మహేంద్ర, ఉత్తేజ్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయ రికార్డులను పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి పి.రమా

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి పి.రమా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి ఆక్సిజన్ పరికరం వితరణ



ఆక్సిజన్ పరికరాన్ని అందజేస్తున్న వైసిపి నేతలు

గుత్తి : ప్రభుత్వ ఆసుపత్రికి వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ పరికరాన్ని విరాళంగా ఇచ్చారు. మాజీ సీఎం దివంగత నేత వైయస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని వైసిపి జిల్లా నాయకులు బళ్లారి రాజ్ కుమార్ రెడ్డి సమకూర్చిన రూ. 30 వేలు విలువ చేసే ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్ పరికరాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్పకు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే అమిలినేని పర్యటన

బ్రహ్మసముద్రం : బ్రహ్మసముద్రం మండలంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం పర్యటించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ పాలబండ శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని సంతే కొండాపురం, ఎరడికెర, పాలవెంటాపురం గ్రామాల్లో పర్యటించి 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. కావున మండలంలోని టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వినతి



నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గం : రెవెన్యూ అధికారులు బేడ, బుడగ జంగం కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగయ్య కోరారు. మంగళవారం పట్టణంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'బేడ బుడగ సంఘం సామాజిక వర్గం చదువుకోవాలా? లేక అడుక్కోవాలా?' అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకపోవడంతో విద్యను మధ్యలోనే అర్ధాంతరంగా ఆపేస్తున్నారన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ కార్యకర్తలు శంకర్, మారేష్, సురేష్, ఆనంద్, కృష్ణప్ప, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధం

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షనర్‌ల పితామహుడు ధరమ్ స్వరూప్ నకారా కాంస్య విగ్రహావిష్కరణ ఏర్పాట్లను సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. మంగళవారం పెన్షనర్ భవన్‌లో కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకారా కాంస్య విగ్రహ ఆవిష్కరణకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. నేడు ఉదయం 9.30 గంటలకు పెన్షనర్స్ భవన్ ప్రాంగణంలో నకారా విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాస్‌తో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రుల సమావేశానికి హాజరుకండి


రాయదుర్గం : రాయదుర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న గురువారం నిర్వహించనున్న మెగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉదయం 10 గంటలకు సరస్వతి కళామందిరం హాలులో జరగనున్న 2.0 ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం ఉంటుందన్నారు.

యల్లనూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంఇఒలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలోని నాయకునిపల్లి సుంకులమ్మ దేవస్థానంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిశీలకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

రుష్యశృంగముని, రంగరాయల చిత్రపటాలకు పాలాభిషేకం



చిత్రపటాలకు పూజలు చేస్తున్న స్థానికులు

శింగనమల : ఋషి శృంగముని, రంగరాయల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా మంగళవారం మండల కేంద్రం సమీపంలోని శింగనమల క్రాస్‌లో వారి చిత్రపటాలకు పాలాభిషేకంతోపాటు పూజలు చేశారు. ఈ సందర్భంగా శింగనమల గ్రామవాసి రామ్‌చరణ్ యాదవ్ మాట్లాడుతూ శింగనమల క్రాస్‌లోని ఆరు వరుసల రోడ్డు సమీపంలో శృంగముని, రంగరాయుల విగ్రహ ప్రతిష్ట చేసి అన్నదాన భవనం నిర్మించి నిత్యాన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగనమల, శివపురం గ్రామస్తులు తిరుపతయ్య, వెంకట్‌నారాయణ, ప్రసాద్, బాలాజీ, ముని, పెద్ద రాముడు, మహమ్మద్ రఫీ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడుదాం : సిడిపిఒ

ఉరవకొండ : మొక్కలను పెంచి రాబోవుతరానికి పర్యావరణాన్ని కాపాడదామని ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో అంగన్వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్వాడి సెంటర్లు ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు సాలమ్మ, శాంతికుమారి, ఆయాలు లత, జెశీల, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న సిడిపిఒ, అంగన్వాడీలు

వైఎస్ఆర్‌కు నివాళి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో వైసిపి సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్, మండల కన్వీనర్ పొన్నపాటి మహేష్‌రెడ్డి, ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్లు మండల కేంద్రంలో వైసిపి ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పావతి భీమిరెడ్డి, కురుబ రమేష్, బోయ నాగేంద్ర, కరణం భీమిరెడ్డి, సుంకన్న, గిరిబాబు, దేశాయి సిద్ధార్థ, ఉపసర్పంచు ఓబుళమ్మ, గాజుల చిన్న వెంకటేష్, కేశన్న, డిష్ వెంకటేష్, రాజశేఖర్, జనార్ధన్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, హంపయ్య, ప్రసాద్, ఉమాశంకర్, ఓబులేష్, కొత్తకోట హనుమంతు, తిమ్మరాజు, లతీఫ్, శ్రీరాములు, పెద్దన్న, మాల్యం తిక్కన్న, శశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా వారపు సంత మైదానం, రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డి, నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, ఉషారాణి, నాగరాజురెడ్డి, చుంచుల నాగప్ప, మేకల శ్రీనివాసులు, రామాంజనేయులు, గోవిందరాజులు, శారద, లావణ్య, శ్రీలక్ష్మి, రేఖ, మంజునాథ, సంజీవ, నజీర్, శివ, శివప్ప, దిలావర్ బాషా, శ్రీరామిరెడ్డి, ఇస్మాయిల్, నిజాం, అంపారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులిర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్, నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, ఖాదర్‌వలీఖాన్, రఘునాథరెడ్డి, శంకర్‌యాదవ్, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, కుళ్లాయిరెడ్డి, శ్రీరాములు, అమీర్‌బాషా, రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, తుంపెర పక్కిరెడ్డి, గుత్తి గోపాల్‌రెడ్డి భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్, నాయకులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్, పార్వతి, వెంకట శివారెడ్డి, అంజి, పూల నారాయణస్వామి, రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్, ముత్యాల రంగనాథ్, పసలూరు భయపరెడ్డి, చికెన్ నారాయణస్వామి, ఆదినారాయణ, పూల రంగనాథ్ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చీమలవాగుపల్లి గ్రామంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామూర్తిరెడ్డి, రామచంద్రారెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంబాయి రమేష్‌నాయుడు, బాల రమేష్‌బాబు, వెన్నపూస వెంకటరామిరెడ్డి, లక్ష్మీదేవి, సంజీవరాయుడు, కాసా చంద్రమోహన్, బ్రహ్మానందరెడ్డి, చిట్టెంరెడ్డి బాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గుత్తి, ఆర్ఎస్ లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి యువనేత సిబి. మంజునాథరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్ రెడ్డి,జి.గంగరాజు యాదవ్, నాయకులు డి.హుస్సేన్ పీరా, జి.గోవర్ధన్ రెడ్డి లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేకులను కోసి పంచిపెట్టారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డి.వన్నూరుబి, వైస్ చైర్ పర్సన్ బి.వరలక్ష్మి, ఎంపీపీ జి.విశాలాక్షి, కౌన్సిలర్లు వి.వరద,వాల్మీకి శివ,నజీర్, ఫారూఖ్, నాయకులు ప్రవీణ్ కుమార్ యాదవ్, గురు ప్రసాద్ యాదవ్ బి.రమేష్ రెడ్డి,ఎం.రంగస్వామి, వై.రామసుబ్బారెడ్డి, హరినాథ్ రెడ్డి, చిన్నా, రాజేష్, నూర్ నాయక్, వైపి. బాబు ,తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల మనిషి అని వైసీపీ సమన్వయకర్త రంగయ్య కొనియాడారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంగళవారం కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, సీనియర్ నాయకులు ఉమామహేశ్వరనాయుడులతో కలిసి పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కత్తరించి పంచిపెట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ, రంగయ్యలు మాట్లాడుతూ పేదల సంక్షేమంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారన్నారు.

ఈయన స్ఫూర్తితో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో వున్నప్పుడు ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. అనంతరం సరోజ కాంపౌండ్ ఆవరణంలోని వైసీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది దాకా రక్తదానం చేశారు. వారందరిని పార్టీ పెద్దలు అభినందించారు. అదేవిధంగా కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామంలో సర్పంచు శోభరాణి, ఎంపీటీసీ బలరాం, నాయకులు వైఎస్ఆర్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. పలు గ్రామాలలో గ్రామస్థాయి నాయకులు కూడా వేడుకలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైసీపీ కన్వీనర్లు గోళ్ల సూరి,ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, సుదీర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉద్యానవనానికి 'ఉపాధి' ఊతం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మెట్ట భూముల్లో పండ్లతోటల పెంపకాన్ని పేద రైతులు సద్వినియోగం చేసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆవులదట్లలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఆగిన పండ్ల మొక్కల పెంపకాన్ని కూటమి ప్రభుత్వం పున:ప్రారంభించిందన్నారు. దీంతోపాటు చంద్రబాబు చతురతతో 18 శాఖలను అనుసంధానం చేసి వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేపట్టారన్నారు. పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి పనులు వేగం పుంజుకున్నాయన్నారు. ఉపాధి నిధుల ద్వారా గోకులం షెడ్లు నిర్మాణం, సిమెంట్ రహదారులు నిర్మించుకొన్నామన్నారు. ప్రస్తుతం మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాయదుర్గం నియోజకవర్గంలో 500 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు పెంచాలని నిర్ణయించగా, ఇప్పటికే 200 ఎకరాల్లో రైతులు ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, మండల కన్వీనర్ హనుమంతు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గుత్తి : మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ అన్నారు. గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామంలో మంగళవారం హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద ఎంపీ, టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడు యాదవ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లతో వర్షాలు బాగా కురుస్తాయన్నారు. ప్రాణవాయువు లభిస్తుందన్నారు. చెట్ల పెంపకంతో వాతావరణ సమతుల్యం లోపించదన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపిడిఒ డి.ప్రభాకర్, టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్‌కుమార్, నాయకులు కరిడికొండ సూరి, ఎన్.సుధాకర్‌నాయుడు, పి.శ్రీకాంత్‌చౌదరి, శ్రీనివాస్‌చౌదరి, ఎన్.ప్రభాకర్‌నాయుడు, కోనంకి కృష్ణ, చికెన్ శీనా, ఎ.నరసింహులు, పిల్లెల్లి కృష్ణయ్య, మాజీ ఎంపిపి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో ఉద్యానవన తోటల పెంపకం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.4,30,000తో మహిళా రైతు నాగలక్ష్మి చేపట్టిన పండ్ల తోటల పెంపకానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాభావం నెలకొన్న పరిస్థితుల్లో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ భూముల్లో ఉద్యానవన పంటల సాగు చేయడం లాభసాటిగా ఉంటుందన్నారు. ఉద్యానవన పంటలకు బిందు సేద్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, ఇఒఆర్‌డి సదాశివ, ఎంపిపి దాసరి సునీత, టిడిపి నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, సర్పంచు మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీలో నాయకులు



మొక్కలు పంపిణీ చేస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పెద్దపప్పూరు : మండల పరిధిలోని జూటూరు గ్రామ పంచాయతీ తిమ్మనచెరువు గ్రామంలో రైతు రామాంజనేయులురెడ్డి పొలంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శకుంతల, ఎపిఒ గంగరాజు, కూలీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మండల పరిధిలో పి.కొత్తపల్లి గ్రామంలో పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, డ్వామా పీడీ సలీంబాషా, ఎంపిడిఒ బిల్లే విజయలక్ష్మి, ఎపిఒ వెంకటనారాయణ, ఇసి సయ్యద్ బబ్లూ, టిఎ రామ్మోహన్, టిడిపి నాయకులు నారాయణస్వామి, హనుమప్పచౌదరి, రవీంద్రారెడ్డి, నరసింహచౌదరి, వాల్మీకి కందల ఓబుళపతి, వెంకటనారాయణ, బొమ్మయ్య, రామకృష్ణ, రామదాసు, అక్కులన్న, ఉమాపతి, కురుబ ఆదినారాయణ, కొత్తపల్లి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని లక్ష్మీనారాయణ పొలంలో మామిడి మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం సహాయాధికారి విజయభారతి మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు చంద్రానాయక్, సుందరం, విజయలక్ష్మి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామంలో పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని టిడిపి కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, సర్పంచి వనితా మల్లికార్జున ప్రారంభించారు. ఇందులో భాగంగా రైతు గొల్ల నాగభూషణ వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమలో ఇసి జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్ వన్నూరుస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, రామచంద్ర, మోహన్, టిడిపి నాయకులు విరూపాక్షి, అంకే ఓబులేష్, వన్నూరుస్వామి, మఠం చంద్రశేఖర, శ్రీరాములు, ఎర్రిస్వామి, నరసింహ, మంజు, వెంకటేశులు, డీలర్ చన్నమల్ల, కృష్ణమూర్తి, చనమల్ల, పాల్గొన్నారు.

నార్పల : ఉద్యానవన పంటలకు ఉపాధి హామీ పథకం కింద ఊతం అందిస్తున్నట్లు పలువురు అధికారులు, నాయకులు అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం ఎండల పరిధిలోని కురగానపల్లి గ్రామంలో రైతు గోపాల్ రెడ్డి పొలంలో మామిడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శంకర్‌యాదవ్, ఎపిఒ రమేష్ రామారావు, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, మాజీ మండల కన్వీనర్ మోహన్, కేశవరెడ్డి, లక్ష్మీనారాయణ, రైతులు గోపాల్‌రెడ్డి, జైచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా సుమారు 80 ఎకరాల్లో ఉద్యానవన మొక్కలను నాటినట్లు ఎంపిడిఒ కరుణసాగర్ తెలిపారు. ఇందులో భాగంగా రైతుల పొలాల్లో చీనీ, దానిమ్మ, మామిడి, జామ సపోట, జామ, తదితర మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్, ఎపిఒ ఓబిరెడ్డి, ఇసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం,
చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : పర్యావరణం పచ్చదనంలో భాగంగా మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని బందార్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి మంగళవారం పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిపత్రి మండలంలో దాదాపు 20 ఎకరాల్లో పండ్ల మొక్కలు సాగు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి : జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో మండలంలో పెద్దఎత్తున పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ తెలిపారు. ఈమేరకు మంగళవారం పామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు అలీ మహమ్మద్ పొలంలో పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఐదెకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ ఆదినారాయణమ్మ, టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ బొమ్మా మోహన్, శ్రీరాములు, రఘునాథ్‌రెడ్డి, తిమ్మప్ప, జనసేన నాయకులు ధనుంజయ, కొట్టాల సూర్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామ పంచాయతీలో సర్పంచు దబ్బర మౌనిక ఆధ్వర్యంలో మంగళవారం మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, విస్తరణ అధికారి డి.శివరంజని, పంచాయతీ కార్యదర్శి వర్ల శంకర్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు వెంకట నాయుడు, సీనియర్ నాయకులు కొనంకి రాధాకృష్ణమూర్తి, మొరుసు జయరాములు, కాకర్ల రఘు, ఎఫ్ఎ వన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



యల్లనూరు మండలంలో మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు, నాయకులు



పెద్దపప్పూరు మండలంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు